క్లుప్తంగా

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మక్తల్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని లీగల్ న్యాయవాది కవిత అన్నారు. శనివారం పట్టణంలో బస్టాండ్ వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జీపు డ్రైవర్లకు, యువకులు, ప్రజలకు బాల్యవివాహాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఏమైనా సంఘటనలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



ఊట్కూర్: మండలంలోని నిడుగుర్తిలో ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్యంపై లహాలు, సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఉదయం అల్పాహారం విధిగా భుజించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ సంతోషిని, ఉపాధ్యాయులు సునీత, లియాకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా గుర్తించాలి

మరికల్: రాబోయే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ గెలిచిన ఈ సారి అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు దండు శ్రీనివాస్ రెడ్డి, పద్మనాభంరెడ్డి, అనిల్‌రెడ్డి అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అప్పంపల్లికి చెందిన రైతుల భూములు మందిపల్లి, మరికల్, కిష్టాపూర్, పస్పుల, మాధవరం శివారులో ఉండటంతో పంటరుణాలు, ఆర్ఓఆర్‌లు, పహాణీలు తీసుకోవాలంటే అన్నిగ్రామాల అధికారుల చుట్టు తిరగలేకపోతున్నామని వాపోయారు.

అసెంబ్లీ కోఆర్డినేటర్ నియామకం

మక్తల్: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేటర్‌గా రఘుపతిరెడ్డిని టీపీసీసీ శనివారం నియమించింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ మీడియా కోఆర్డినేటర్ కుమార్ నియమించినట్లు చెప్పారు. కోఆర్డినేటర్‌గా రఘుపతిరెడ్డిని నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న ప్రచారం

నారాయణపేట/నర్వ: కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి శనివారం కోయిలకొండ మండలం అంబ్రునాయక్ తాండలో ప్రచారంచేసి హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని గిరిజనలను అభ్యర్థించారు. నర్వ మండలంలో ఆయాగ్రామాల్లో శనివారం కాంగ్రెస్ ప్రచారం ముమ్మరంగా కొనసాగింది. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేసి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు.

కాంగ్రెస్‌లో చేరిక..

కోస్గి: మండల పరిధిలోని మీర్జాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్జేడీ, కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మామ జగన్నాథ్‌రెడ్డి శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసంలో చేరారు.

పర్ణికారెడ్డిని గెలిపించాలి

మరికల్: కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త పనిచేయాలని కాంగ్రెస్ నాయకులు మండలంలో పలు గ్రామాల్లో శనివారం వారు ఇంటింటి ప్రచారం చేసి కాంగ్రెస్ విడుదలచేసిన మెనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలను ప్రజలకు వివరించారు.

ఒక్క అవకాశం ఇవ్వండి..

కోస్గి: ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థి బంటు రమేష్ గుండుమాల్ మండల పరిధిలో ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించి స్థానికుడిగా తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు.

బీఆర్‌ఎస్‌కే తమ మద్దతు..

నర్వ: దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన బీఆర్‌ఎస్‌కే తమ మద్దతు ఉంటుందని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణాలోని దళితుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన బీఆర్‌ఎస్‌కు నియోజకవర్గాల్లో సంపూర్ణ మద్దతునిచ్చి గెలిపిస్తామన్నారు.

ఘనంగా మహాలింగేశ్వర స్వామి జాతర

నారాయణపేట రూరల్ : మండలంలోని సింగారంలో మహాలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటలకు పల్లకిసేవా, నిర్వహించారు. ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు, సర్వదర్శనం అనంతరం భక్తులకు అన్నదానం ఉంటాయన్నారు.

తగ్గిన వేరుశనగ సాగు

- గతేడాది జిల్లాలో 10 వేల ఎకరాల్లో పంట
- ఈ ఏడాది ఆరు వేల ఎకరాలకు మించని వైనం
- అమాంతం పెరిగిన పెట్టుబడులు.. ఆందోళనలో రైతన్నలు



మరికల్‌లో వేరుశనగ పంటలో కలుపు తీస్తున్న కూలీలు

మరికల్: జిల్లాలో ఈ ఏడాది యాసంగి వేరుశనగ ఆశించిన స్థాయిలో లేదు. రైతులు అధికశాతం పత్తి వైపు మొగ్గు చూపడంతో వేరుశనగ సాగు పూర్తిగా తగ్గింది. గతేడాది 10 వేలకు పైగా సాగు చేయగా.. ఈసారి ఆరువేల ఎకరాలకు పడిపోయింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో యాసంగి సాగుకు ఎక్కువ శాతం రైతులు సమాయత్తమవుతుంటారు. అయితే అధికారులు క్షేత్రస్థాయిలో యాసంగి పంటలపై అవగాహన కల్పించకపోవడంతో రైతులు ఏ పంటలు సాగుచేసుకోవాలో అర్థం కాక వరిసాగుకు అధికశాతం మొగ్గు చూపుతున్నారు.

కొందరు పంట విరామం..

జిల్లాలో ఆరువేల ఎకరాల్లో ఈ ఏడాది రైతులు వేరుశనగ పంటను సాగుచేస్తున్నారు. యాసంగిలో సాగుచేసే ఆముదం, మినుములు, పొద్దుతిరుగుడు, పెసర్లు, జొన్న, కూరగాయల సాగు కేవలం వందల ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. అలాగే కొందరు పంట విరామం కూడా ప్రకటించారు. వానాకాలంలో ఆశించిన స్థాయిల్లో వర్షాలు లేకపోవడంతో యాసంగిలో వ్యవసాయ బోర్లలో భూగర్భజలాలు తగ్గే ప్రమాదం కూడా ఉంది. మరో దిక్కు పెట్టుబడులు రైతులకు భారంగా మారడంతో పంటలకు పెట్టిన పెట్టుబడులు రాక పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఎన్నికల కోడ్ సందర్భంగా ప్రభుత్వం ఇప్పటి వరకు యాసంగి సాగుకు అందాల్సిన రైతుబంధు కూడా ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేయలేదు.

పెట్టుబడులు అధికమవుతున్నాయి..



వేరుశనగ పంట సాగు చేయలంటే కత్తిమీదసాము లాంటిదే రాత్రింబవుళ్లు కష్టపడితే తప్ప చేతికి రాదు. దీనికి తోడు పెరిగిన పెట్టుబడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎకరాకు ఒకప్పుడు రూ. 15 అయితే, ప్రస్తుతం రూ. 40వేల ఖర్చు అవుతుంది. అడవి పందుల భారీనుంచి పంటను కాపాడుకునేందుకు రాత్రి నిద్రహారాలు విడిచి పొలం వద్ద ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వెంకటయ్య, రైతు, మరికల్

క్వింటాల్ రూ. 10వేలు ఉండాలి..



పెరిగిన పెట్టుబడుల కారణంగా క్వింటాల్ వేరుశనగ రూ. 10వేలు ఉంటే రైతులకు లాభం వచ్చే అవకాశం ఉంది. లేకుంటే పెట్టుబడులు రాని పరిస్థితి. గత పదేళ్ల నుంచి 3ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేస్తున్నాను. ఎన్నడు కూడా ఆశించిన మేర లాభాలు రాలేదు. మద్దతు ధర ఉంటేనే రైతులకు మేలు జరుగుతుంది.

హన్మంతు, పల్లెగడ్డ

అవగాహన కల్పిస్తున్నాం..

వరితోపాటు యాసంగిలో ఆరుతడి పంటలపై రైతులు మొగ్గుచూపేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు లేకపోవడంతో రైతులు ఆరుతడి పంటల సాగుకు మొగ్గుచూపడం లేదు. ప్రస్తుతం ఆరు వేల ఎకరాల్లో వేరుశనగ, మిగతా ఆరుతడి పంటలు 1,535 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వరిసాగు ఇంకా ప్రారంభం కాలేదు.

– జాన్ సుధాకర్, జిల్లా వ్యవసాయ ధికారి

ప్రజలకు సేవ చేయడమే ధ్యేయం



పాతపల్లిలో ప్రచారం చేస్తున్న వాకిటి శ్రీహరి

మక్తల్: నియోజకవర్గ ప్రజలందరూ తనను మక్తల్ ఎమ్మెల్యేగా గెలిపించాలని, వారికి సేవ చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం పట్టణంలో ఊట్కూర్‌కు చెందిన దళిత సంఘం నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఊట్కూర్ మండలంలోని పాతపల్లోల్ల వాకిటి శ్రీహరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపల్లి, కొత్తపల్లి గ్రామాలకు రోడ్డు వేస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి నేటి వరకు ఉందని తెలిపారు. అధికారంలోకి రాగానే 6 గ్యారెంటీలు అమలు చేస్తామని పేర్కొన్నారు. మక్తల్ పట్టణంలో శ్రీహరి సతీమణి వాకిటి లలిత ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నారాయణపేట జెడ్పీ చైర్మన్ వనజమ్మ, సీతాదయాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, గడ్డంపల్లి హన్మంతు, సిద్దార్థరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న వాకిటి శ్రీహరి

అధికారంలోకి వస్తే బీసీ అభ్యర్థే సీఎం

అమరచింత: బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వండి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామని కర్ణాటక రాష్ట్ర కోలార్ బీజేపీ ఎంపీ మునిస్వామి అన్నారు. మక్తల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలేంధర్‌రెడ్డితో కలిసి మండలంలోని కొత్తతండాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని పలువురు గిరిజనులను బీజేపీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం ప్రపంచ దేశాలతో సమానంగా అభివృద్ధిలో ముందుకు సాగడమే కాకుండా దేశ గౌరవాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన గతన పీఎం నరేంద్ర మోదీకి దక్కిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ అభ్యర్థిని సీఎంగా ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్, మేర్వరాజు, అశోక్, నారాయణ, వెంకటేశ్వర్లు, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, నరాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: సబ్బండ వర్గాల అభ్యున్నతి ఒక్క బీజేపీకే సాధ్యమని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఈటల రాజేందర్ సీఎం అవుతారని కోలార్ ఎంపీ మునిస్వామి అన్నారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మక్తల్ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్ రెడ్డితో కలిసి మాట్లాడారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్, బీజేపీ ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు అశ్విన్‌కుమార్, మేర్వరాజు, అశోక్‌జీ, రేచింతలశ్రీను, రాజు, నాగేందర్‌రెడ్డి, శేషు, రఘు, రవిఉన్నారు.

కంకణం కట్టు.. ఓట్లు పట్టు

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కర్ణాటక రాష్ట్రం కోలార్ బీజేపీ ఎంపీ మునిస్వామి మక్తల్ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి చేతికి కంకణం కట్టి ఓట్లు బాగా రాబట్టాలని సూచించారు.

నర్వ: మండలంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, హన్మంతురెడ్డి, గంగాధర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమరచింత తండాలో ప్రచారం నిర్వహిస్తున్న జలంధర్‌రెడ్డి

దేశానికే ఆదర్శం కేసీఆర్ పాలన



కోటకొండలో ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసి, అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కోటకొండలో ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని, ప్రస్తుత మేనిఫెస్టోని వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నేతలు చేస్తున్న విషప్రచారాన్ని నియోజకవర్గంలో అన్ని స్థాయిలో పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ తిప్పికొడుతున్నారన్నారు. అధికారమే పరమావధిగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్, బీజేపీ కుట్రలు ప్రజలకు అర్థమవుతుందన్నారు. ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి జిల్లా కేంద్రంలోని 6వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికల జోరు

నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన వారు పార్టీలో చేరడంతో వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. దామరగిద్ద మండలం అన్నసాగర్ చెందిన రాజా, రాములు ఆధ్వర్యంలో 30 మంది బీఆర్ఎస్‌లో చేరారు. మరికల్ మండలంలోని పెద్ద చింతకుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

మరికల్: ఎమ్మెల్యే అభ్యర్థి రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని మండలంలోని ఆయాగ్రామాల్లో శనివారం మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ గెలిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

ముమ్మరంగా ఓటరు స్లిప్పుల పంపిణీ

కోయిల్‌కొండ: మండలంలోని ఇబ్రహీంనగర్, చందాపూర్, అయ్యవారిపల్లిలో అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్వోలు ఓటర్లకు స్లిప్పులు ఎన్నికల నియామవళి కరపత్రాలను శనివారం పంపిణీచేశారు. ఎంపీడీఓ జయరాములు పర్యవేక్షించారు. మండలంలోని పోలీంగ్ కేంద్రాల పరిధిలో బీఎల్ఓలు వీధి, విధి తిరుగుతూ చీటీలు పంపిణీ చేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా వీటితో పాటు ఓటుపై అవగాహన కల్పించే ఓటరు గైడ్ పుస్తకం, ఎన్నికల ప్రవర్తనా నియామావళి ఉల్లఘించకుండా అవగాహన కల్పించే కరపత్రాలను అందించాలన్నారు.

నేడు కర్ణాటక రైతుల బైక్ ర్యాలీ

కృష్ణా: తెలంగాణలో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ఆదివారం కర్ణాటకకు చెందిన రైతులు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు విజప్పగౌడ్, శివరాజ్ పాటిల్, అంజనేయులు శనివారం ప్రకటనలో తెలిపారు. దేవసూగూర్‌లోని సూగూరేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం 200మంది రైతులు, మైనార్టీలు, దళితుల ఆధ్వర్యంలో మరికల్, మక్తల్, దేవరకద్ర, మహబూబ్‌నగర్, నారాయణపేట ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సరిహద్దులో స్థానిక బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. బైక్ ర్యాలీలో నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సర్వధర్మ సమ్మేళనం..

నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లిలో ఆదివారం సర్వధర్మ సమ్మేళనం ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు సలీం, షఫీచాంద్, జాఫర్‌తాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ శివారులోని దర్గా హజ్రత్ సయ్యద్ షా అమ్మద్ ఖతల్ హుస్సేని ఉర్సు సందర్భంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. వివిధ మతాలకు చెందిన గురువులు, పండితులు, ఫాస్టర్లు హాజరవుతున్నట్లు చెప్పారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత అని జిల్లా సివిల్ జడ్జి సంధ్యారాణి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో బాలల హక్కులపై నిర్వహించిన సెమినార్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై సమాజం ప్రత్యేక గౌరవం కలిగి ఉండాలని సూచించారు. చైల్డ్ లేబర్‌ను గుర్తిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని, బాల బాలికలకు తప్పనిసరిగా విద్యను అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక జడ్జి హరికుమార్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, కోఆర్డినేటర్ పుష్పలత, వాసంతి, నయీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



నారాయణపేట రూరల్: పట్టణంలో శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వ్యవసాయ పొలాల్లో కోతలు మొదలు కావడంతో రైతుల సౌకర్యార్థం ఏర్పాటుచేస్తున్నట్లు విండో అధ్యక్షుడు పీ.నర్సింహారెడ్డి తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నదాతలు తమ ధాన్యాన్ని తీసుకొచ్చి అమ్ముకోవాలని సూచించారు. అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మల్లేష్, నర్సింహులు, వెంకటయ్య, సుశీలమ్మ, పద్మమ్మ, రైతులు పాల్గొన్నారు.

60 కేజీల నల్లబెల్లం పట్టివేత

దామరగిద్ద: కర్ణాటక సరిహద్దు గ్రామమైన కాన్‌కుర్తి చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీల్లో పోలీసులు 60కిలోల నల్లబెల్లం, నవసాగ్రం, పట్టిక పట్టుబడింది. కర్ణాటక రాష్ట్రం యానగుంది నుంచి కాన్‌కుర్తి వైపు వస్తున్న స్కూటీని తనిఖీచేయగా బెల్లం పట్టుబడినట్లు ప్రోహిబిషన్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, దయాకర్, పుష్పరాజ్ తెలిపారు. నిందితుడు మహ్మదబాద్‌కు తరలిస్తున్న గుర్తించామన్నారు. చట్టపరంగా నిందితుడిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరో వ్యక్తి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 2 లక్షల నగదులు సీజ్‌చేసినట్లు తెలియజేశారు.

నామమాత్రంగా వెల్‌కం బోర్డు ఏర్పాటు



చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు స్వాగతం పలికేలా ఆలయ అధికారులు విద్యుత్ దీపాలతో వెలకం బోర్డును మైదానంలో ఏర్పాటు చేశారు. ఈ బోర్డును వెదురు బొంగులతో నామమాత్రంగా ఏర్పాటు చేశారు. దీంతో ఆదివారం స్వామి వారి ఉద్దాల ఉత్సవానికి లక్షలాది భక్తుల తాకిడికి కర్రలు విరిగే అవకాశం ఉందని స్థానిక దుకాణదారులు వాపోతున్నారు. అధికారులు పరిశీలించి కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యాభివృద్ధి

- డీఆర్పీ వీరుమల్లేష్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్పీ వీరు మల్లేష్

కోస్గి: తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో మరింత విద్యాభివృద్ధి జరుగుతుందని డీఆర్పీ వీరు మల్లేష్ సూచించారు. ఈ మేరకు శనివారం గుండుమాల్ మండల పరిధిలోని హన్మాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ప్రతిరోజూ కొంతసమయం తమ పిల్లల చదువుకు కేటాయించి పాఠశాలల్లో జరుగుతున్న పాఠ్యాంశబోధన, సామర్థ్యం తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో సైతం జవాబుదారితనం పెరుగుతుందన్నారు. ఇంటి వద్ద చదువుకునే తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధచూపాలని తల్లిదండ్రులకు సూచించారు. హెచ్‌ఎం నర్సింహులు, ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : విద్యార్థులను అన్నిరకాలుగా అభివృద్ధి చేయాలంటే ఉపాధ్యాయులకు వారి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని హెచ్‌ఎంలు అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో శనివారం పీటీఏ సమావేశాలు కొనసాగాయి. ఆయా స్కూల్‌లలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై చిన్నారుల ప్రగతి వివరాలు తెలియజేశారు.

మాగనూర్: మండల పరిధిలోని పెగడబండలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. పాఠశాల హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులచే పుస్తకపఠనం, విద్యార్థులల్లో భద్రత గురించి సూచనలు ఇచ్చారు. తొలిమెట్టు ఎఫ్ఎల్ఎన్ వర్క్ బుక్స్ గురించి వివరణతోపాటు ఇతర అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో విద్యావలంటరీ మహదేవ్, విద్యార్థుల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించడానికే ఫ్లాగ్‌మార్చ్



రెనివట్లలో కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

మద్దూరు: ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొదించేందుకు శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడానికి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ జనార్దన్ తెలిపారు. శనివారం మండలంలోని దొరేపల్లి, రెనివట్లలో జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలు కీలక పాత్రపోసిస్తాయని పోలింగ్‌కేంద్రాల యందు సాయిధ బలగాలతో కలిసి పోలీసు సిబ్బంది విధులను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, ఆర్ఎస్ శివశంకర్ పాల్గొన్నారు.

వృథాగా పాత ఆర్ఐ భవనం



అపరిశుభ్రంగా మారిన పాత ఆర్ఐ కార్యాలయం

మరికల్: మండల కేంద్రంలో ఏడేళ్ల నుంచి వృథాగా ఉన్న పాత ఆర్ఐ కార్యాలయ స్థలంలో మినీ ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ ఉన్న అధికారులు స్పందించడం లేదు. గ్రామానికి కిలోమీటర్ దూరంలో నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రికి రోగులు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. వీరి సౌకర్యంకోసం గ్రామం నడిబొడ్డున మినీ ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరైంది. ఇందుకు పాలకుల, అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోంది. దీంతో ఆర్ఐ కార్యాలయాన్ని వృథాగా వదిలేయడంతో మురుగునీరు చేరి అపరిశుభ్రంగా మారింది. అక్కడి కాలనీవాసులకు ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపిస్తున్న పాలకులు పట్టించుకోవడం లేదనే ఆరోపణాలు వినిపిస్తున్నాయి. వెంటనే అధికారులు స్పందించి మినీ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ఘనంగా ఝాన్సీలక్ష్మీబాయి జయంతి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

మక్తల్: వీరవనిత ఝాన్సీలక్ష్మిబాయి జయంతిని శనివారం పట్టణంలోని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమెచేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ముఖ్యవక్త శేషమ్మ, జిల్లా కన్వీనర్ నరేష్, ఆంజనేయులురెడ్డి, వంశీ, నిఖిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెమృతి

మరికల్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. మరికల్‌కు చెందిన నారాయణరెడ్డి గేదే శనివారం వ్యవసాయపొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా విద్యుత్‌తీగలు తగలి అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 70 వేల విలువ చేసే పాడి గేదె మృతి చెందడంతో బాధిత రైతును ట్రాన్స్‌కో అధికారులు ఆదుకోవాలని కోరుతున్నారు. అనంతరం ఈ ఘటనపై పశువైద్య సిబ్బంది పంచనామా చేశారు.